# అధ్యాయం-1

## అవలోకనం

పేజీలు 1 - 14

## 1.1 ఈ నివేదిక గురించి...

భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సీఏజీ) ద్వారా జరిగే ఆడిట్ ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించి, 2012 ఏప్రిల్‌లో పునర్వ్యవస్థీకరించారు. ఆడిట్ ఏర్పాట్లలో సమగ్రత కోసం, ఆడిట్ పరిశీలనలను రంగాలవారీగా నివేదించే ఉద్దేశంతో ఈ పునర్వ్యవస్థీకరణ జరిగింది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రత్యేక ప్రయోజనాల కోసం ఏర్పాటయిన సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు, మొదలైన వాటి ఆడిట్‌ను తగురీతిన సామాజిక, ఆర్థిక, రెవెన్యూ, సామాన్య రంగాలవారీగా సమీకృతం చేయడం జరిగింది.

ఈ నేపథ్యంలో, ప్రస్తుత సంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించి రంగాలవారీగా ఆడిట్ నివేదికలను విడివిడిగా రూపొందించి, వాటిని భారత రాజ్యాంగ నిబంధనలను అనుసరించి గవర్నరుకు సమర్పించడం జరుగుతుంది.

రాష్ట్రంలో సామాన్య, సామాజిక రంగాలకు సంబంధించి ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న పథకాలు, ప్రభుత్వశాఖల పనితీరును తనిఖీ చేసినపుడు వెల్లడైన అంశాలతో సహా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖలు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రణాళికా పథకాలకు సంబంధించిన లావాదేవీల్లో నియమపాలన తనిఖీలోనూ, రాష్ట్ర స్వయంపాలక సంస్థల తనిఖీలోనూ వెల్లడైన అంశాలు ఈ ఆడిట్ నివేదికలో ఉన్నాయి.

ఆడిట్‌లో వెల్లడైన అంశాల్లో ముఖ్యమైన వాటిని రాష్ట్ర శాసనసభ దృష్టికి తీసుకెళ్లడమే ఈ నివేదిక ప్రధాన ఉద్దేశం. ఆడిట్ ప్రమాణాల ప్రకారం, ఏవైనా ఆడిట్ పరిశీలనలను ఈ నివేదికలో పొందుపర్చాలంటే, అవి సంబంధిత లావాదేవీల స్వభావం, పరిమాణాలకు తగ్గస్థాయిలో ఉండాలి. కార్యనిర్వాహక అధికార్లు దిద్దుబాటు చర్యలు తీసుకునే విధంగానూ, సంస్థల మెరుగైన ఆర్థిక నిర్వహణకు ఉపయోగపడే విధానాలను రూపొందించుకునే విధంగానూ, తగిన మార్గదర్శకాలను జారీచేసే విధంగానూ ఆడిట్ పరిశీలనలుండాలి. ఆవిధంగా, ఆడిట్ పరిశీలనలు సుపరిపాలనకు దోహదపడతాయి.

నియమపాలన తనిఖీలో, ప్రభుత్వశాఖలు, సంస్థలు భారత రాజ్యాంగంలోని నిబంధనలు, సంబంధిత చట్టాలు, నియమనిబంధనలు, సంబంధిత అధికార్లు జారీ చేసిన వివిధ ఉత్తర్వులు, నిర్దేశాలను పాటిస్తున్నాయని నిర్ధారించుకోడానికి వాటి లావాదేవీలను తనిఖీ చేయడం జరుగుతుంది. మరోవైపు, పనితీరు సమీక్షలో నియమ పాలన తనిఖీతో పాటు, ఆయా పథకాల/కార్యక్రమాల/ప్రభుత్వశాఖల లక్ష్యాలను పొదుపుగానూ, సమర్థవంతంగా నూ, ప్రభావశీలంగానూ సాధించారా, లేదా అని పరిశీలించడం కూడా జరుగుతుంది.

ఈ అధ్యాయంలో, ఆడిట్ ప్రణాళిక, పరిధిల గురించి వివరించడం జరిగింది. ఎంపిక చేసిన పథకాల అమలులో ప్రభుత్వ శాఖలు/సంస్థలు సాధించిన విజయాలు, ఆడిట్‌లో గమనించిన ప్రధానలోపాలు, లావాదేవీల తనిఖీలో వెల్లడైన ప్రధానమైన అంశాలు, ఇంకా గత ఆడిట్ నివేదికలపై తీసుకున్న చర్యల వివరాలను కూడా ఈ అధ్యాయంలో క్లుప్తంగా వివరించడం జరిగింది.

## 1.2 సామాన్య, సామాజిక రంగాల సంక్షిప్త స్వరూపం

రాష్ట్రంలో సామాన్య, సామాజిక రంగాల కిందకు వచ్చే ప్రభుత్వ శాఖలు గత ఐదేళ్ళలో చేసిన ఖర్చుల వివరాలను పట్టిక 1.1లో చూపడమైంది.

పట్టిక 1.1

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | ప్రభుత్వ శాఖ | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
|---|---|---|---|---|---|---|
| ఎ | సామాన్య రంగం | | | | | |
| 1 | ఆర్థిక, ప్రణాళిక | 19936.26 | 19769.25 | 23079.94 | 28572.35 | 30529.86 |
| 2 | సాధారణ పరిపాలన | 353.76 | 594.14 | 717.03 | 444.09 | 705.90 |
| 3 | హోమ్ | 2190.04 | 2536.26 | 3068.72 | 3916.43 | 4412.53 |
| 4 | న్యాయ | 284.47 | 326.71 | 415.47 | 612.53 | 603.63 |
| 5 | రెవెన్యూ | 975.95 | 1098.14 | 2132.93 | 1964.19 | 2412.21 |
| 6 | రాష్ట్ర శాసన సభ | 49.40 | 54.09 | 53.56 | 51.08 | 84.69 |
| | **మొత్తం (ఎ)** | **23789.88** | **24378.59** | **29467.65** | **35560.67** | **38748.82** |
| బి | సామాజిక రంగం | | | | | |
| 1 | వెనుకబడిన తరగతుల సంక్షేమం | 497.24 | 1088.91 | 1181.74 | 1996.34 | 2758.53 |
| 2 | వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాలు | 1001.51 | 2771.67 | 2546.13 | 2415.79 | 2450.69 |
| 3 | వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం | 2529.28 | 3006.66 | 3323.02 | 4140.35 | 4980.25 |
| 4 | ఉన్నత విద్య | 1423.78 | 1334.60 | 1731.51 | 2551.16 | 2669.73 |
| 5 | గృహనిర్మాణం | 3207.60 | 4083.13 | 1398.34 | 1626.77 | 1743.33 |
| 6 | కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు | 254.63 | 325.36 | 287.43 | 347.29 | 465.67 |
| 7 | అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం | 123.33 | 195.72 | 197.88 | 324.62 | 370.33 |
| 8 | మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి | 2291.83 | 3527.45 | 3139.85 | 4054.53 | 4108.89 |
| 9 | పంచాయతీరాజ్ | 3022.01 | 3768.10 | 2758.32 | 3533.15 | 2987.51 |
| 10 | గ్రామీణాభివృద్ధి | 1982.83 | 2563.08 | 3159.24 | 3921.78 | 4855.68 |
| 11 | పాఠశాల విద్య | 5207.60 | 5827.19 | 6690.92 | 9906.66 | 12250.18 |
| 12 | సాంఘిక సంక్షేమం | 1451.08 | 1448.93 | 1245.12 | 1776.64 | 1941.74 |
| 13 | గిరిజన సంక్షేమం | 565.86 | 705.10 | 765.45 | 961.50 | 1143.23 |
| 14 | స్త్రీ, శిశు, వికలాంగులు, వయోజనులు | 831.98 | 1146.37 | 995.99 | 981.29 | 1513.03 |
| 15 | యువజనాభ్యుదయం, పర్యాటకం, సాంస్కృతిక వ్యవహారాలు | 191.98 | 139.27 | 101.29 | 188.18 | 214.38 |
| | **మొత్తం (బి)** | **24582.54** | **31931.54** | **29522.23** | **38726.05** | **44453.17** |
| | **పూర్తి మొత్తం (ఎ+బి)** | **48372.42** | **56310.13** | **58989.88** | **74286.72** | **83201.99** |

*మూలం: సంబంధిత సంవత్సరాలకు రాష్ట్ర ప్రభుత్వ అప్రోప్రియేషన్ అకౌంట్లు*

## 1.3 ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (జీఎస్ఎస్ఏ) కార్యాలయం



ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్స్ జనరల్ కార్యాలయాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని 21 శాఖలు, ఆ శాఖల కింది స్థానిక సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు, స్వయంపాలక సంస్థల ఆడిట్‌ను భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (సామాన్య, సామాజిక రంగాల తనిఖీ) కార్యాలయం నిర్వహిస్తుంది.

## 1.4 ఆడిట్‌కు అధికారాలను కల్పించిన నిబంధనలు

భారత రాజ్యాంగంలోని 149, 151వ అధికరణలు, కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సర్వీసు నిబంధనల) చట్టం - 1971 (డీపీసీ చట్టం) ఆడిట్ నిర్వహించే అధికారాన్ని సిఏజీ కి కల్పించాయి. రాష్ట్ర ప్రభుత్వంలోని సామాన్య, సామాజిక రంగాల కిందకు వచ్చే శాఖల ఖర్చుల తనిఖీని డీపీసీ చట్టంలోని 13వ సెక్షను[1] కింద సీఏజీ నిర్వహిస్తారు. స్వయంపాలక సంస్థలు, స్థానిక సంస్థలకు డీపీసీ చట్టంలోని 19(2)[2], 20(1)[3] సెక్షన్ల కింద ఆడిట్‌ను నిర్వహించడం జరుగుతుంది. ఈ సంస్థలకు సీఏజీ ఏకైక (సోల్) ఆడిటరుగా వ్యవహరిస్తారు. ఇవి కాక, పెద్దమొత్తంలో ప్రభుత్వ నిధులను పొందే ఇతర స్వయంపాలక సంస్థలను కూడా చట్టంలోని 14వ సెక్షను[4] కింద సీఏజీ తనిఖీ చేయాలి. వివిధ ఆడిట్‌లకు అనుసరించాల్సిన నియమాలు, విధానాలు సీఏజీ జారీ చేసిన "ఆడిట్ ప్రామాణిక సూత్రాలు" లోనూ, "ఆడిట్ - అకౌంట్ల నిబంధనలు - 2007" లోనూ నిర్దేశించడం జరిగింది.

## 1.5 ఆడిట్ ప్రణాళిక, నిర్వహణ

ఒక ప్రభుత్వశాఖ/సంస్థ/స్వయంపాలక సంస్థ/పథకం మొదలైన వాటిలోని రిస్కును అంచనా వేయడంతో ఆడిట్ ప్రక్రియ మొదలవుతుంది. చేసిన ఖర్చు, కార్యకలాపాల తీవ్రత/సంక్లిష్టత, ఆ కార్యకలాపాలకు ప్రభుత్వమిచ్చిన ప్రాధాన్యత, ఆర్థికపరమైన అధికారాల స్థాయి, అంతర్గత నియంత్రణలు, భాగస్వాముల ప్రయోజనాలవంటి అంశాల ఆధారంగా ఈ అంచనా జరుగుతుంది. గత ఆడిట్‌లో కనుగొన్న విషయాలను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకుంటారు. ఎంత కాలానికి ఒకసారి ఆడిట్ చేయాలి, ఎంతమేరకు ఆడిట్ చేయాలనే విషయాలను ఈ అంచనా ఆధారంగా నిర్ణయించడం జరుగుతుంది. ఈ అంచనా ఆధారంగానే 'వార్షిక ఆడిట్ ప్రణాళిక'ను రూపొందించి, దాని ప్రకారమే ఆడిట్‌ను నిర్వహించడం జరుగుతుంది. 2011-12లో సామాన్య, సామాజిక రంగాల కిందకు వచ్చే యూనిట్ల నుండి మొత్తం 2,042 యూనిట్లను తనిఖీ చేయడమైంది.

---

[1] (i) రాష్ట్ర సంచిత నిధి నుండి జరిగే అన్ని లావాదేవీలు, (ii) రాష్ట్ర అత్యయిక నిధి, ప్రజాపద్దులకు సంబంధించిన అన్ని లావాదేవీలు, (iii) అన్ని వర్తక, ఉత్పత్తి, లాభ-నష్టాల పద్దులు, ఆస్తి, అప్పుల పట్టీలు, ఇతర ఉప పద్దుల తనిఖీ

[2] రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం ద్వారా/కింద ఏర్పాటైన కార్పోరేషన్ల (కంపెనీలు కానివి) పద్దులను సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం తనిఖీ చేయడం

[3] రాష్ట్ర గవర్నర్ చేసిన విజ్ఞప్తి మేరకు ఏదైనా సంస్థ పద్దులను తనిఖీ చేయడం. సి.ఎ.జి., ప్రభుత్వం - ఇరు పక్షాలూ అంగీకరించిన షరతులు, నిబంధనల మేరకు ఈ తనిఖీ జరుగుతుంది

[4] రాష్ట్ర సంచిత నిధి నుండి గ్రాంట్లు లేదా లోన్ల ద్వారా పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం పొందిన సంస్థల అన్ని రాబడులూ, ఖర్చులనూ, అలాగే రాష్ట్ర సంచిత నిధి నుండి గ్రాంట్లు లేదా లోన్ల రూపంలో, ఒక ఆర్థిక సంవత్సరంలో కోటి రూపాయలకు తక్కువ కాకుండా పొందిన సంస్థలకు సంబంధించిన అన్ని రాబడులు, ఖర్చులను తనిఖీ చేయడం జరుగుతుంది

ఒక్కొక్క యూనిట్ ఆడిట్ పూర్తయిన మీదట, ఆడిట్‌లో కనుగొన్న విషయాలను తనిఖీ నివేదిక (ఇన్‌స్పెక్షన్ రిపోర్టు - ఐఆర్) ద్వారా ఆ యూనిట్ అధిపతికి తెలియజేస్తారు. రిపోర్టు అందుకున్న ఒక నెలలోపు అందులోని అంశాలకు సమాధానాలు ఇవ్వాలని కూడా కోరడం జరుగుతుంది. సమాధానాలు అందిన సందర్భాల్లో, ఆయా ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించడం లేదా ఆడిట్ సూచనల అమలుకు తదుపరి చర్యలను సూచించడం జరుగుతుంది. ఈ ఇన్‌స్పెక్షన్ రిపోర్టు (ఐ.ఆర్.)లలోని ఆడిట్ పరిశీలనల్లో కీలకమైనవి, ప్రభుత్వంలోని అత్యున్నతస్థాయి వారి దృష్టికి తీసుకెళ్లాల్సిన వాటిని ఆడిట్ నివేదికల్లో పొందుపరచడానికి అవసరమైన ప్రక్రియను చేపడతారు. భారత రాజ్యాంగంలోని 151 వ అధికరణాన్ని అనుసరించి రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టడం కోసం ఈ ఆడిట్ నివేదికలను రాష్ట్ర గవర్నరుకు సమర్పిస్తారు.

## 1.6 ఆడిట్ కనుగొన్న అంశాలపై ప్రభుత్వ శాఖల స్పందన

కార్యాలయ అధిపతులు, వారి పై అధికార్లు, ఐఆర్‌లలోని అంశాలపై స్పందించి, తగిన దిద్దుబాటు చర్యలను తీసుకోవాలి. ఐఆర్‌లలో పొందుపరచిన ఆడిట్ పరిశీలనలను ఏజీ కార్యాలయం అధికార్లు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికార్లతో జిల్లాస్థాయిలో జరిగే సమావేశాల్లో కూడా చర్చిస్తారు.

2011-12, అంత కన్నా ముందు సంవత్సరాలకు సంబంధించిన 7,163 ఐఆర్‌లు, అందులోని 43,595 పేరాలు 2012 సెప్టెంబరు 30 నాటికి అపరిష్కృతంగా ఉన్నాయి. వీటిలో 716 ఐఆర్‌లు (8,711 పేరాలు) విషయంలో తొలి సమాధానాలు కూడా రాలేదు. ప్రభుత్వ శాఖలవారీగా వివరాలను *అనుబంధం - 1.1* లో ఇవ్వడం జరిగింది.

**పట్టిక 1.2**

| సంవత్సరం | 2012 సెప్టెంబరు 30 నాటికి అపరిష్కృతంగా ఉన్న ఐఆర్‌లు, పేరాలు | | తొలి సమాధానాలు కూడా రాని ఐఆర్‌లు, పేరాలు | |
|---|---|---|---|---|
| | ఐఆర్‌లు | పేరాలు | ఐఆర్‌లు | పేరాలు |
| **2008-09, అంతకు ముందు సంవత్సరాలవి** | 4971 | 24932 | 252 | 4234 |
| **2009-10** | 636 | 5586 | - | - |
| **2010-11** | 1044 | 7752 | 121 | 873 |
| **2011-12** | 512 | 5325 | 343 | 3604 |
| మొత్తం | **7163** | **43595** | **716** | **8711** |

ఆడిట్ జారీచేసిన ఐ.ఆర్‌లు, పేరాలపై చర్యలు చేపట్టకపోవడం వలన, ఈ నివేదికల్లో లేవనెత్తిన తీవ్రమైన ఆర్థిక అవకతవకలు కొనసాగుతూనే ఉండడం, పరిపాలనా ప్రక్రియలో అంతర్గత నియంత్రణలు బలహీనమవడం, ప్రజాసౌకర్యాలను సమర్థవంతంగానూ, ప్రభావశీలంగానూ సమకూర్చలేకపోవడం, మోసాలూ, అవినీతీ చోటు చేసుకుని ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లడం వంటివాటికి అవకాశం కలుగుతుంది.

ఆర్థిక, ప్రణాళికశాఖ 1993 నవంబరులో జారీచేసిన ఆదేశాల ప్రకారం, ఆడిట్ నివేదికల్లో పొందుపర్చిన పేరాలు, సమీక్షలపై సంబంధిత ప్రభుత్వ (పరిపాలన) శాఖలు, ఆడిట్ నివేదికలను శాసనసభలో ప్రవేశపెట్టిన నాటినుండి మూడు నెలల్లోపు వివరణాత్మక నివేదికలను సమర్పించాలి. ఇందుకోసం ప్రజాపద్దుల సంఘం నుండి వచ్చే నోటీసు లేదా పిలుపు కోసం వేచి చూడకుండా, తీసుకున్న చర్యలను లేదా ప్రతిపాదిత చర్యలను సూచిస్తూ వివరణాత్మక నివేదికలను గడువులోపు సమర్పించాలి. ఐతే, 2005- 06 నుండి 2010 -11 సంవత్సరాల ఆడిట్ నివేదికల్లో పేర్కొన్న 13 పేరాలు/సమీక్షలకు వివరణాత్మక నివేదికలను 2013 జనవరి నాటికి 6 ప్రభుత్వశాఖలు సమర్పించలేదు. ఈ వివరాలు *అనుబంధం - 1.2* లో ఉన్నాయి.

ఆర్థికశాఖ జారీ చేసిన సూచనల కరదీపిక, ఇంకా 1993 నవంబరు 3 వ తేదీ నాటి యు.ఓ. ప్రకారం, కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపర్చాలని ప్రతిపాదించిన ముసాయిదా ఆడిట్ పేరాలపై అన్ని ప్రభుత్వశాఖలూ ఆ ముసాయిదా పేరాల నందుకున్న ఆరు వారాల్లోపు తమ సమాధానాలను పంపించాలి. 2012-13 లో ఆడిట్ సమీక్షల తాలూకు 4 ముసాయిదా నివేదికలు , 12 ముసాయిదా పేరాలు/నిర్దిష్ట విషయంపై (థీమేటిక్) పేరాలను సంబంధిత ప్రభుత్వశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు/ముఖ్య కార్యదర్శులు/ కార్యదర్శులకు పంపి, ఆడిట్ కనుగొన్న అంశాలను వారి దృష్టికి తెచ్చి, ఆరు వారాల్లోపు సమాధానం పంపాలని కోరడం జరిగింది. కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో ఈ పేరాలను పొందుపర్చే అవకాశం ఉంది, ఆ నివేదికను రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టడం జరుగుతుంది కాబట్టి, ఆడిట్ కనుగొన్న అంశాలపై వారి వ్యాఖ్యలు/సమాధానాలను కూడా పొందుపర్చాల్సి ఉన్నందున ఈ పేరాలపై వారు వ్యక్తిగత శ్రద్ధ చూపడంకోసం, వారి ప్రతిస్పందన తెలియచేయటం కోసం వాటిని పంపడం జరిగింది. అయినప్పటికీ, ఒక ప్రభుత్వ శాఖ[5] నియమపాలన తనిఖీలో కనుగొన్న అంశాలతో కూడిన ఒక ముసాయిదా పేరాకు తన సమాధానాన్ని తెలుపలేదు. ప్రభుత్వశాఖల నుండి అందిన సమాధానాలను ఈ ఆడిట్ నివేదికలో తగురీతిని పొందుపర్చడం జరిగింది.

## 1.7 ఆడిట్‌లో కనుగొన్న అంశాల్లో ప్రధానమైనవి

2011-12 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని 13 శాఖల పద్దులు, లావాదేవీలను మచ్చుకు తనిఖీ చేసినపుడు కనుగొన్న అంశాలు ఈ నివేదికలో ఉన్నాయి. ప్రజలకు మెరుగైన సేవలందిచడానికి తగిన దిద్దుబాటు చర్యలను తీసుకోవడంలో ప్రభుత్వానికి సహాయకారిగా ఉండటం కోసం కొన్ని నిర్దిష్ట ప్రభుత్వ కార్యక్రమాల అమలును, సామాన్య, సామాజిక రంగాలకు సంబంధించిన విధాన నిర్ణయాల అమలును మదింపు చేయడంపై ఈ ఏడాది ప్రధానంగా ఆడిట్ దృష్టి సారించింది. తొలుత, పథకాలు/ప్రభుత్వ శాఖలపై ఆడిట్ సమీక్షల తాలూకు నాలుగు ముసాయిదా నివేదికలు, థీమేటిక్ ఆడిట్ తాలూకు ఒక ముసాయిదా పేరా, 11 ముసాయిదా పేరాలను ప్రభుత్వానికి పంపడం జరిగింది. ప్రభుత్వానికి పంపిన 11 ముసాయిదా పేరాలకు గానూ, 6 కేసులలో ప్రభుత్వం/ప్రభుత్వ శాఖ దిద్దుబాటు చర్యలను తీసుకోవడంతో ఆ పేరాలను ఈ నివేదికలో చేర్చలేదు.

ఈ ఆడిట్ నివేదికలో పొందుపర్చిన ప్రధానమైన అంశాలను క్లుప్తంగా కింద వివరించడం జరిగింది :

### 1.7.1 రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ పనితీరు

***వివిధ రకాల ప్రమాదాలకు మొదట స్పందించే శాఖగా రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖను గుర్తించారు. అగ్ని ప్రమాదాలు, వరదలు, తుఫానులు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తుల రక్షణ బాధ్యతను ఈ శాఖకు అప్పగించడమైంది. అగ్నిప్రమాదాల నివారణ, అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తలెత్తే అత్యవసర పరిస్థితులనెదుర్కొనే బాధ్యత, అగ్ని ప్రమాదాల గురించి, నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యతలను ఈ శాఖకు అప్పగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ శాఖకు తగిన ప్రాధాన్యతను ఇవ్వకపోవడం, చేసిన అరకొర బడ్జెటు కేటాయింపుల దృష్ట్యా చూస్తే, అగ్నిప్రమాదాలను నియంత్రించడంలో ఈ శాఖ ప్రశంసనీయమైన సేవలు చేస్తోంది. ఐతే, రాష్ట్రంలో ఫైర్‌స్టేషన్లు చాలా తక్కువగా ఉన్నాయి. రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ సమర్థవంతంగానూ, ప్రభావవంతంగానూ పనిచేయడానికి తగిన మౌలిక వసతులు, పరికరాలు లేవు.***

***అగ్నిమాపక సేవల శాఖపై 2002-03లో నిర్వహించిన ఆడిట్‌లో కనుగొన్న విషయాలను 2003 మార్చి 31తో ముగిసిన సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై వెలువరించిన కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపర్చడం జరిగింది. ఈ శాఖ పనితీరులో ముఖ్యమైన లోపాలను ఆ నివేదికలో ప్రముఖంగా***

[5] ఉన్నత విద్యా శాఖ ('బహుళ ప్రయోజనాల ఆడిటోరియం నిర్మాణంలో జాప్యం' కు సంబంధించిన ఆడిట్ పేరా విషయంలో)

చర్చించడమైంది. ఈ శాఖకు సంబంధించిన విధానాలను సరైన మార్గంలోకి తీసుకురావడానికి చేపట్టాల్సిన వివిధ చర్యలను కూడా ఆ నివేదికలో సిఫార్సు చేయడం జరిగింది. గత పదేళ్ళ కాలంలో ఈ శాఖ పనితీరు ఏ మేరకు మెరుగుపడిందో పరిశీలించేందుకు ప్రస్తుత ఆడిట్‌ను నిర్వహించడమైంది. ఈ సమీక్షలో, **2007-12** మధ్య కాలంలో అగ్నిమాపక సేవలకు సంబంధించి, ఈ శాఖ కార్యకలాపాలను పరిశీలించడం జరిగింది. ఇందుకోసం ఏడు[6] జిల్లాలను మచ్చుకు తనిఖీ చేయడమైంది. గత ఆడిట్‌లో మచ్చుకు తనిఖీ చేసిన ఐదు జిల్లాల్లోని నాలుగు జిల్లాలు[7] ప్రస్తుత నమూనా ఆడిట్ (శాంపిల్)లో కూడా ఉన్నాయి.

ఆడిట్‌లో కనుగొన్న ప్రధాన అంశాలను ఈ కింద పేర్కొనడమైంది:

- రాష్ట్ర ప్రభుత్వం తాను నియమించిన ఉప సంఘం చేసిన ప్రధాన సిఫార్సులేవీ మూడేళ్ళకు పైగా గడచినప్పటికీ **(2012 నవంబరు)** అమలు చేయలేదు. రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ తన బాధ్యతలను నెరవేర్చడానికి అవసరమైన ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం బడ్జెటు కేటాయింపుల్లో ఇవ్వలేదు. అంతేకాక, భారత ప్రభుత్వం నిర్దేశించినవిధంగా విపత్తుల ఉపశమన నిధి నుండి నిధుల విడుదల జరగని కారణంగా, ఈ శాఖ ఆధునికీకరణ ప్రక్రియ కుంటుపడింది.

**(పేరాలు 2.3.3, 2.4, 2.4.1)**

- మౌలిక వసతులకు సంబంధించి ఎస్ఎఫ్ఏసీ[8] నిర్దేశించిన ప్రమాణాలను రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ పాటించలేదు. రాష్ట్రంలో అగ్ని ప్రమాదాల విషయంలో తలెత్తే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి ఈ శాఖ వద్ద సరైన ఏర్పాట్లు లేవు. రాష్ట్రంలోని **875** మండలాల్లో (మొత్తం మండలాలు: **1,128**), **89** అసెంబ్లీ నియోజకవర్గాల్లో (మొత్తం నియోజకవర్గాలు: **294**) ఒక్క ఫైర్ స్టేషనూ లేదు. కొత్త ఫైర్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని గత ఆడిట్ నివేదికలో నిర్దిష్ట సిఫార్సును చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉపసంఘం కూడా ఇదే సిఫార్సును చేసింది. అయినప్పటికీ, **2007-12** మధ్యకాలంలో కొత్తగా ఒక్క ఫైర్ స్టేషన్ కూడా ఏర్పాటు కాలేదు. ఫైర్ స్టేషన్ల కొరత **95** శాతం వరకూ ఉంది. ఫైర్‌స్టేషన్ల కొరత ప్రభావం అగ్ని ప్రమాద కాల్స్‌కు స్పందించే సమయంపై పడింది. ఆడిట్‌లో సమీక్షించిన ప్రధాన అగ్ని ప్రమాదాల్లో కాల్స్‌కు స్పందించే సమయం పట్టణ ప్రాంతాల్లో **70** నిముషాలు, గ్రామీణ ప్రాంతాల్లో **152** నిముషాలు పట్టింది. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లో పట్టణ ప్రాంతాల్లోని **20** ప్రధాన, తీవ్ర అగ్ని ప్రమాద సంఘటనల్లో స్పందన సమయం **30** నిముషాలకు పైగానూ, గ్రామీణ ప్రాంతాల్లోని **60** ప్రధాన, తీవ్ర అగ్ని ప్రమాద సంఘటనల్లో స్పందన సమయం **60** నిముషాలకు పైగానూ పట్టిందని ఆడిట్ సమీక్షలో వెల్లడైంది.

**(పేరాలు 2.5.1.1, 2.5.1.2, 2.5.2.1)**

- ఫైర్ స్టేషన్లలో మౌలిక వసతులు చాలినంతగా లేవు. మచ్చుకు తనిఖీచేసిన **85** ఫైర్‌స్టేషన్లకు గానూ, **6** ఫైర్‌స్టేషన్లలో అగ్నిమాపక వాహనాలను నిలిపేందుకు వసతిలేదు; **17** ఫైర్‌స్టేషన్ల భవనాలు శిధిలావస్థలో ఉన్నాయి. అగ్నిమాపక వాహనాలు, రక్షణ వాహనాలు (రెస్క్యూ వ్యాన్స్) వంటి వాటి విషయంలో అవసరాలకు, వాస్తవంగా అందుబాటులో ఉన్న వాటికి మధ్య భారీ అంతరం ఉంది. ఇప్పటికే కొనుగోలుచేసిన అత్యధిక పౌనఃపున్యంగల రేడియోసెట్ల వంటి పరికరాలను అగ్నిమాపక శాఖ వినియోగించటంలేదు. ఫైర్ స్టేషన్ల సమీపంలో నీటి వనరులుండేలా చర్యలు చేపట్టలేదు.

**(పేరా 2.5.1.2)**

[6] చిత్తూరు, హైదరాబాద్, క్రిష్ణా, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, విశాఖపట్నం, వైయస్ఆర్ (కడప)

[7] చిత్తూరు, హైదరాబాద్, క్రిష్ణా, విశాఖపట్నం

[8] అగ్నిమాపక సలహాల స్థాయీ సంఘం (స్టాండింగ్ ఫైర్ అడ్వయిజరీ కౌన్సిల్)

- మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో (వైఎస్ఆర్ (కడప) జిల్లాలోనూ, హైదరాబాద్ జిల్లాలో కొన్ని కేసులు తప్ప) ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని ఏ ఒక్క జిల్లాలోనూ సహాయక సేవల (ఆక్జిలరీ సర్వీసుల) ఏర్పాటు జరగలేదు.

  ***(పేరా 2.5.2.2)***

- అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణకు సంబంధించిన భద్రతా చర్యల నియమావళి/ప్రమాణాలను అమలు చేసేందుకు ప్రమాదాలు సంభవించడానికి ఆస్కారం ఉన్న ప్రాంగణాలను పాక్షికంగా మాత్రమే గుర్తించారు. భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించిన, ముందు జాగ్రత చర్యలు తీసుకోని వారిపై జిల్లా అగ్నిమాపక అధికారులు చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వ భవనాలు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, సినిమా థియేటర్లు వంటి బహిరంగ ప్రదేశాలను అగ్నిమాపక సేవల శాఖ అధికార్లతో కలసి ఆడిట్ లో ఉమ్మడి ప్రత్యక్ష తనిఖీ చేయగా అగ్ని ప్రమాదాల రక్షణ ప్రమాణాల విషయంలో పలు ఉల్లంఘనలు జరిగినట్లు వెల్లడైంది.

  ***(పేరా 2.5.2.2)***

- ఫైర్ మేన్, డ్రైవర్ ఆపరేటర్ వంటి కీలక పోస్టుల్లో చాలా ఖాళీలు ఉండటం వల్ల మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోనూ పూర్తి స్థాయి సిబ్బంది లేకుండానే అగ్నిమాపక సేవల నిర్వహణ జరుగుతోంది. మంటలనార్పే విధుల నిర్వహణకు ముగ్గురు ఫైర్‌మ్యాన్‌లు అవసరంకాగా ఆడిట్‌లో సమీక్షించిన **293** భారీ అగ్ని ప్రమాదాలకు సంబంధించిన కేసులకుగానూ, **207** కేసులలో ఒకే ఒక్క ఫైర్‌మ్యాన్ లేదా ఇద్దరు ఫైర్‌మ్యాన్‌లు మాత్రమే విధుల నిర్వహణలో పాల్గొన్నారు.

  ***(పేరాలు 2.6.1, 2.6.2)***

- శిక్షణ, నైపుణ్యాల పెంపునకు సంబంధించిన కార్యక్రమాలకు తగిన ప్రాధాన్యతను ఇవ్వలేదు. **2007-12** మధ్యకాలానికి శిక్షణను ఇవ్వడానికి రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థ (ఎస్‌టీఐఎస్) ఎలాంటి కార్యాచరణ ప్రణాళికనూ రూపొందించలేదు. డిప్యూటేషన్‌పై తీసుకున్న **811** మంది హోమ్ గార్డులలో ఏ ఒక్కరికీ అగ్నిప్రమాదాలను ఎదుర్కోవడంలో శిక్షణను ఇవ్వలేదు. నిర్దిష్ట కాలవ్యవధుల్లో శాఖాపరమైన తనిఖీలు నిర్వహించలేదు. వ్యయ నియంత్రణలు బలహీనంగా ఉన్నాయి. **2007-12** మధ్య కాలంలో ఒక్క విశాఖపట్నంలో తప్ప మిగిలిన జిల్లా కార్యాలయాల్లో అంతర్గత తనిఖీ నిర్వహించలేదు.

  ***(పేరాలు 2.6.3.1, 2.6.3.2, 2.7.1, 2.7.3, 2.7.4)***

## 1.7.2 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు స్కాలర్‌షిప్ పథకాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరంభించిన ఈ స్కాలర్‌షిప్ పథకాలు ఒక ముఖ్యమైన సాంఘిక సంక్షేమ కొలమానానికి ప్రతీక. షెడ్యూల్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్ తెగలు (ఎస్టీ), వెనుకబడిన తరగతులు (బీసీ), మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులను విద్యా సంస్థల్లో చదువు కొనసాగించేలా చేయడం, ఆయా విద్యార్థుల భర్తీ సంఖ్యను పెంచడం ఈ పథకాల ఉద్దేశం. సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీల సంక్షేమ శాఖల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోంది. ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సమయానుసారంగా నిర్దేశించే పరామితుల ఆధారంగా ఈ పథకాల ప్రయోజనాలను అందించడం జరుగుతోంది.

అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందాయా అన్న అంశాన్ని మదింపు చేసేందుకు ఆడిట్ ఈ స్కాలర్‌షిప్ పథకాలను సమీక్షించింది. ఈ ఆడిట్‌లో గమనించిన ముఖ్యమైన విషయాలు ఈ విధంగా ఉన్నాయి :

## ప్రణాళికా రచన

*స్కాలర్‌షిప్‌ను 'సాచ్యురేషన్ బేసిస్'[9] (సంతృప్తత ప్రాతిపదిక) ప్రకారం అందజేస్తున్నారు కనుక స్కాలర్‌షిప్ మొత్తాన్ని మంజూరు చేయడానికి ముందే ప్రభుత్వం అర్హులైన విద్యార్థులను గుర్తించడం అవసరం. తల్లి దండ్రుల ఆదాయ వివరాలను నిర్దేశించిన 'ఫారం'లోనే సమర్పించేలా సంక్షేమశాఖలు చూడడంలేదు. విద్యార్థుల చిరునామా ధృవీకరణ, మొదలైన ఇతర వివరాలను నిర్ధారించుకుని, భరోసానిచ్చే యంత్రాంగమేదీ ప్రభుత్వం వద్ద లేదు. 'ఈపాస్' వ్యవస్థలోని సమాచారాన్ని (స్కాలర్‌షిప్ దరఖాస్తులు), పౌరసరఫరాల శాఖ డేటాబేస్‌తో ఆడిట్ సరిపోల్చి చూడగా, స్కాలర్‌షిప్ డేటాబేస్ లో పేర్కొన్న రేషన్ కార్డు వివరాలు పౌరసరఫరాల డేటాబేస్‌లో లభ్యంకాని సందర్భాలు అనేకం ఉన్నాయని వెల్లడైంది. అవసరమైన వివరాలు లేని కారణంగా కొన్ని సందర్భాల్లో స్కాలర్‌షిప్ మొత్తాలను విద్యార్థుల ఖాతాల్లోకి నోడల్ బ్యాంకులు జమ చేయకపోవడం ఈ అంశాన్ని మరింత బలపరుస్తోంది.*

**(పేరా 3.3.1)**

## నిధుల విడుదలలు, వ్యయం

- *పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి ప్రభుత్వం నిధులను స్తంభింపజేయడం వలన **2008-12** మధ్య కాలంలో కేటాయించిన నిధుల్లో సుమారు **24** శాతం నిధులు వినియోగం కాకుండా మిగిలిపోయాయి.*

  **(పేరా 3.4.2)**

- *ప్రభుత్వం పరిచయం చేసిన 'నోడల్ బ్యాంకుల ద్వారా స్కాలర్‌షిప్‌ల చెల్లింపు' విధానంలో, ఖాతాలను ఉపయోగించని విద్యార్థుల వివరాలను ఆయా బ్యాంకులు ప్రతి మూడు నెలలకు, కాలేజీ లవారీగా, జిల్లా అధికారికి తెలియజేయాలి. ఐతే, నోడల్ బ్యాంకులు, కార్పోరేట్ ఇంటర్నెట్ బ్యాంకింగ్, పీడీ ఖాతాల్లో చెల్లింపులు జరగకుండా భారీ మొత్తంలో (**₹176.83** కోట్లు) నిధులు ఉండిపోయాయి.*

  **(పేరా 3.4.2.4)**

- *సంస్థలకున్న అవసరాలను తెలుసుకోకుండా వాటికి ప్రభుత్వం నిధులను విడుదల చేయడం వలన, **2012** మార్చి నాటికి, వివిధ స్కాలర్‌షిప్ పథకాలకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదలచేసిన మొత్తంలో **₹99.60** కోట్లు ఆయా సంస్థలవద్ద[10] (ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ : **₹80.70** కోట్లు, ఏపీఎస్ సీఎమ్ఎఫ్‌సీ: **₹10.44** కోట్లు, యూఏఏపీ : **₹8.46** కోట్లు) పేరుకుపోయాయి.*

  **(పేరా 3.4.2.1)**

- *హైదరాబాద్ జిల్లా బీసీ సంక్షేమ అధికారి పరిధిలోని నాలుగు డివిజన్లలో **2010** నవంబరు-**2011** డిసెంబరు మధ్యకాలంలో **4,156** ఈజీ పే/ఏటీఎమ్ కార్డులు అపహరించబడ్డాయి. వాటిద్వారా **471** బ్యాంకు ఖాతాల నుండి **₹17.25** లక్షలను (ఈ ఖాతాల్లో జమచేసిన మొత్తం **₹19.12** లక్షల్లో **90** శాతం) మోసపూరితంగా డ్రా చేసారు.*

  **(పేరా 3.4.2.6)**

- *విడుదల చేసిన నిధుల్లో **70** శాతం (**₹1,122** కోట్లు) నిధులకు జిల్లా సంక్షేమ అధికారులు/విద్యా సంస్థలు వినియోగధృవపత్రాలను ఇంకా సమర్పించాల్సి ఉంది.*

  **(పేరా 3.4.2.8)**

---

[9] 'సంతృప్తత ప్రాతిపదిక' అంటే అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్ అందేలాచూడడం. ఒకవేళ ప్రస్తుత సంవత్సరంలో స్కాలర్‌షిప్ మంజూరుకాని విద్యార్థులకు తర్వాతి సంవత్సరంలో ప్రాధాన్యతనిచ్చి స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తారు

[10] ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ), ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ (మైనారిటీ) ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీఎస్‌సీఎమ్ఎఫ్‌సీ), ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ (యూఏఏపీ)

## ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలు

- *ఈ పథకాలను అమలుచేయటానికి భారత ప్రభుత్వం తన వాటాగా* ***₹16.93*** *కోట్లను* ***2008-10*** *మధ్యకాలంలో విడుదలచేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం 'అంగీకరించిన మొత్తం' (కమిటెడ్ లయబిలిటీ)తో పాటు తన వాటాగా అందించాల్సిన మొత్తాన్ని కూడా విడుదల చేయలేదు. ఆకారణంగా, భారత ప్రభుత్వం* ***2010-12*** *కాలానికి ఎటువంటి నిధులను విడుదల చేయలేదు.*

***(పేరా 3.5.1)***

## పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలు

- *ఈపాస్ వ్యవస్థలో పలు లోపాలున్నాయి. మాన్యతానియంత్రణలు (వేలిడేషన్ కంట్రోల్స్) చాలినన్ని లేకపోవడంతో,* ***₹64.71*** *కోట్ల మొత్తంతో ముడిపడిఉన్న పలు నియమవిరుద్ధమైన/అధిక చెల్లింపులు/బూటకపు క్లెయిమ్‌లను ఈపాస్ వ్యవస్థ అనుమతించింది.*

***(పేరాలు 3.6.3.2 నుండి 3.6.3.4 వరకు, 3.6.3.6 నుండి 3.6.3.8 వరకు)***

- *విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను మంజూరు చేయడంలో/చెల్లించడంలో అసాధారణమైన జాప్యాలు జరిగాయి.* ***2009-11*** *మధ్యకాలంలో* ***19*** *శాతం వరకు విద్యార్థులకు, అదే విద్యా సంవత్సరంలో నిర్వహణ రుసుం (ఎమ్‌టీఎఫ్), ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఆర్‌టీఎఫ్) లను మంజూరు చేయని ఫలితంగా ఆ కాలేజీల యాజమాన్యం విద్యార్థులను ఫీజులు చెల్లించమంటూ నిర్బంధిస్తున్నాయి.*

***(పేరా 3.6.3.5)***

- *మేనేజ్‌మెంట్ కోటా కింద* ***2009-10*** *సంవత్సరంలో ఇంజినీరింగ్/ఎమ్‌బీఏ/ఎమ్‌సీఏ/బీఎడ్ కోర్సుల్లో చేరిన వారికి ఆర్‌టీఎఫ్, ఎమ్‌టీఎఫ్‌లకు గాను నియమవిరుద్ధంగా* ***₹6.18*** *కోట్ల మొత్తాన్ని మంజూరుచేసారు.*

***(పేరా 3.6.5.2)***

- *రాష్ట్ర ప్రభుత్వం,* ***2008-09*** *నుండి, మైనారిటీ వర్గాల విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్ రేట్లను, వెనుకబడిన తరగతులకు వర్తించే రేట్లకు సరిసమానంగా పెంచింది. ఐతే, స్కాలర్‌షిప్ లను మంజూరు చేసేటప్పుడు ఈ పెరిగిన రేట్లను వర్తింపజేయలేదు. ఫలితంగా, మైనారిటీ వర్గ విద్యార్థులు* ***₹2.70*** *కోట్లమేర స్కాలర్‌షిప్ చెల్లింపుకు దూరమయ్యారు.*

***(పేరా 3.6.5.5)***

- *స్కాలర్‌షిప్ దరఖాస్తులను తనిఖీ చేయడంలో పరిశీలనాధికారులు తగిన శ్రద్ధ చూపలేదు. ఫలితంగా, కొన్ని సందర్భాల్లో అధిక రేట్లతో స్కాలర్‌షిప్‌ను మంజూరుచేయడం జరిగింది. విద్యార్థుల హాజరుకు సంబంధించి రికార్డులను నిర్వహించని కారణంగా, నిర్దేశించిన వివరణలను సరిచూసుకోకుండానే స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడం జరుగుతోంది.*

***(పేరాలు 3.6.5.1, 3.6.5.6, 3.6.5.7)***

- *వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన వేరువేరు కాలేజీ లలో ఒకే రకమైన కోర్సుకు ఫీజు విధానంలో భారీ వ్యత్యాసాలున్నాయని గమనించడం జరిగింది. ఫలితంగా అదే కోర్సుకు వేరువేరు రేట్లను చెల్లించడం జరుగుతోంది.*

***(పేరా 3.6.5.10)***

### లబ్ధిదారుల సర్వే

*ఆడిట్ మచ్చుకు తీసుకున్న జిల్లాల్లో ఎంపిక చేసిన కాలేజీలను సందర్శించి అక్కడ జరిపిన సర్వే, ఆన్‌లైన్ ద్వారా **3,061** విద్యార్థులనుండి పొందిన సమాచారం వెల్లడి చేస్తున్న అంశాలు :*

- *66 శాతం విద్యార్థులు స్కాలర్‌షిప్‌ను ఒకటి నుండి మూడేళ్ళ జాప్యాలతో పొందారు.*
- *34 శాతం విద్యార్థులు దరఖాస్తులను సమర్పించడంలో ఇబ్బందులనెదుర్కొంటున్నారు.*
- *21 శాతం విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల మంజూరీలో సమస్యలనెదుర్కొంటున్నారు.*
- *9 శాతం విద్యార్థులు కాలేజీలకు ఆర్‌టీఎఫ్‌ను ముందస్తుగా చెల్లించేలా వారిపై వత్తిడి తెచ్చారు.*
- *15 శాతం విద్యార్థులు పూర్తి స్కాలర్‌షిప్‌ను పొందలేదు.*
- *11 శాతం విద్యార్థులు తమ ఈజీపే కార్డులను కాలేజీయాజమాన్యమే అట్టిపెట్టుకుందని తెలిపారు.*

***(పేరా 3.7.5.1)***

## 1.7.3 జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం (జేఎన్ఎన్‌యూఆర్ఎం) అమలు

*జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకాన్ని (జేఎన్ఎన్‌యూఆర్ఎం) భారత ప్రభుత్వం **2005** డిసెంబరులో ప్రవేశపెట్టింది. పట్టణ మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరిచే వ్యవస్థ సామర్థ్యంమీద దృష్టి సారించి, పట్టణ స్థానిక సంస్థలకు ప్రజలపట్ల జవాబుదారీతనం, సామాజిక భాగస్వామ్యం పెంపొందే విధంగా ఎంపిక చేసుకున్న నగరాల ఆధునికీకరణకూ, త్వరితగతిన ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి దోహదపడటంకోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద గుర్తించిన **65** మిషన్ సిటీలలో నాలుగు - హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి - ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కోసం కేంద్ర ప్రభుత్వం **2012** మార్చి నాటికి మొత్తం **₹11,907** కోట్ల ప్రాజెక్టు వ్యయంతో **251** ప్రాజెక్టులను ఆమోదించింది.*

*సంస్కరణలకు నిర్దేశించిన కార్యాచరణ కట్టుదిట్టంగా అమలు జరిగిందా, నగరాల మౌలిక అభివృద్ధికి అవసరమైన వాటిని సమగ్రంగా అంచనావేశారా, వివిధ ప్రాజెక్టులకు ప్రణాళికా రచన సక్రమంగా జరిగిందా, వాటిని పొదుపుగానూ సమర్థవంతంగానూ అమలుజరిపి ఆశించిన ఫలితాలు సాధించారా వంటి పలు విషయాలను ధృవీకరించుకోనేందుకు జేఎన్ఎన్‌యూఆర్ఎం మీద ఆడిట్ సమీక్ష నిర్వహించటం జరిగింది. మొత్తం నాలుగు మిషన్ సిటీలు, **38** నాన్-మిషన్ సిటీలలో అమలుచేసిన మొత్తం **₹6,352** కోట్ల (**53** శాతం) ప్రాజెక్టు విలువకల **74** ప్రాజెక్టులను సమగ్ర ఆడిట్ పరిశీలనకు ఎంపిక చేయటం జరిగింది. ఈ ఆడిట్ సమీక్షలో గమనించిన ముఖ్యమైన విషయాలు ఈ కింది విధంగా ఉన్నాయి :*

### సంస్కరణల అమలు

*జేఎన్ఎన్‌యూఆర్ఎం ను జాతీయ స్థాయిలో సంస్కరణలతో ముడిపడిన పెట్టుబడి ప్రేరణగా నిర్దేశించారు. రాష్ట్ర స్థాయి సంస్కరణలు అమలు జరగగా, పలు పట్టణ స్థానిక సంస్థలలో సంస్కరణల అమలు వాటి లక్షిత మైలురాళ్ళతో పోలిస్తే ఆలస్యం జరిగాయి. ఎక్రూవల్ ప్రాతిపదికన జంటపద్దు విధానంలో లెక్కలు రూపొందించే సంస్కరణ విజయవంతంగా అమలు చేసినట్లుగా పట్టణ స్థానిక సంస్థలు, రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ కేంద్ర ప్రభుత్వానికి పంపిన నివేదిక సరికాదు. ఆస్తిపన్ను **90** శాతం వసూలు దక్షత, నీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణలో నూరు శాతం ఖర్చుల వసూలు ఆశించిన విధంగా ఏ పట్టణ స్థానిక సంస్థలోనూ సాధించలేదు.*

***(పేరా 4.3)***

## కార్యక్రమాల అమలు

- *మురుగునీటి పారుదల, నీటి సరఫరా, వరదనీటి కాలువలు, గృహనిర్మాణం, పట్టణ రవాణాకు సంబంధించి సమగ్ర పరిశీలనకోసం ఆడిట్ ఎంపిక చేసిన **74** ప్రాజెక్టులలో **2012** జూన్ నాటికి కేవలం **28 (38** శాతం**)** మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసుకుని, వినియోగంలోకొచ్చాయి. నమూనా తనిఖీలో గమనించిన దానిని బట్టి పనులలో జాప్యానికి ప్రధాన కారణాలు మురుగునీటి పారుదల, నీటి సరఫరా పనుల విషయంలోనైతే పైపులు వేయటంలో ప్రణాళికా లోపం, సాంకేతిక విధానాలలో మార్పులు, స్థల సేకరణ పూర్తి కాకపోవటం, అవసరమైన జల వనరులను ముందుగా గుర్తించకపోవటం, ఇతర శాఖలనుంచి అనుమతులు సంపాదించటంలోని జాప్యం, మొదలైనవి.*

***(**పేరాలు **4.7.1, 4.7.2)***

- *మొత్తం **₹1,781** కోట్ల ఆమోదిత వ్యయంతో **2005-09** మధ్యన ఆమోదించిన **16** మురుగునీటి పారుదల ప్రాజెక్టులను సమగ్ర పరిశీలన కోసం ఆడిట్ ఎంపిక చేసింది. వీటిమీద **₹1,090** కోట్లు ఖర్చు చేసినా, ఒక్క ప్రాజెక్టు మాత్రమే పూర్తయింది. అదే విధంగా **2005-09** మధ్యన **₹2,457** కోట్ల వ్యయంతో ఆమోదించిన **35** నీటి సరఫరా పథకాలను ఆడిట్ పరిశీలనకు ఎంపిక చేయగా, **2012** జూన్ నాటికి **11** ప్రాజెక్టులు మాత్రమే ప్రారంభమయ్యాయి.*

***(**పేరాలు **4.7.3, 4.7.5)***

- *గృహ నిర్మాణ పథకాలు **2005-08** లో మంజూరైనవి ఐదింటిని నమూనా ఆడిట్‌లో పరిశీలించగా, **2012** జూన్ నాటికి **₹1,159** కోట్లు ఖర్చు చేసినాగానీ వీటిలో ఒక్కటికూడా పూర్తికాలేదు. ప్రత్యేకించి తిరుపతిలో నిర్మాణ పనులు వెనుకబడ్డాయి. అవసరమైన స్థలం లభించకపోవటం, నిధులకొరత ఆలస్యానికి కారణాలు.*

***(**పేరాలు **4.7.7, 4 7.7.2, 4.7.7.3)***

- *టెండరింగ్ ప్రక్రియలో పలు లోపాలున్నాయి. టెండర్లను ఖరారు చేయటంలో వ్యవస్థీకృత విధానాలను అనుసరించలేదు. పనులను సింగిల్ బిడ్డర్లకు అప్పగించారు. పనులను అనేక ప్యాకేజీలుగా విభజించటం, నామినేషన్ ప్రాతిపదికన అప్పగించటం జరిగింది.*

***(**పేరా **4.6)***

## పర్యవేక్షణ, మూల్య నిర్ధారణ

*మూడవ పక్షం తనిఖీ, పర్యవేక్షక సంస్థలు/స్వతంత్ర సమీక్ష, పర్యవేక్షక సంస్థలు (టీపీఐఎమ్ఏలు/ఐఆర్ఎమ్ఏ)లను ఈ ప్రాజెక్టుల అమలు తీరు పర్యవేక్షించేందుకు నియమించవలసి ఉండగా, నమూనా తనిఖీ చేసిన వాటిలోని కొన్ని ప్రాజెక్టులను ప్రారంభించిన తరువాతనే వీటిని నియమించారు. ఫలితంగా ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలకు ముందు దశలలో ఈ పర్యవేక్షక సంస్థల పాత్రలేదు.*

***(**పేరా **4.8)***

## ప్రభావ విశ్లేషణ

*ఆయా ప్రాజెక్టుల అమలు ప్రభావం పట్ల ప్రజల అవగాహనను అంచనా వేసే దిశగా **20** ప్రాజెక్టులకు సంబంధించి **1,528** మంది లబ్దిదారులను ఆడిట్ సర్వే చేసింది. మురుగునీటి ప్రాజెక్టుల గురించి సర్వే చేసినవారిలో **85 - 90** శాతం తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు చేపట్టటం వలన తమ ప్రాంతాలలో మురుగునీటి సమస్య తగ్గిందని వారు తెలిపారు. ఐతే, నీటి సరఫరా, వరదనీటి పారుదల కాలువలు, గృహనిర్మాణ ప్రాజెక్టులపై మిశ్రమ స్పందన వచ్చింది. వరదముప్పు తప్పిపోవటం, వసతులు మెరుగుపడటంపట్ల కొందరు సంతోషం వ్యక్తం చేయగా, హైదరాబాద్, తిరుపతి నగరాలలో ఇళ్ల విస్తీర్ణం తగ్గిపోవటం, మంచినీటి/మురుగునీటి వసతుల లేమి, రోడ్ల పరిస్థితి*

సరిగా లేకపోవటం, చెత్త కుప్పలనుంచి దుర్వాసన వంటి సమస్యల వలన తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాజెక్టులను త్వరితంగా పూర్తి చేసి, ఆశించిన ప్రయోజనాలను సాధించవలసిన అవసరాన్ని ఆడిట్ నిర్వహించిన సర్వే కూడా బలపరుస్తోంది.

**(పేరా 4.9)**

## 1.7.4 గ్రామీణ నీటి సరఫరా పథకాల అమలు

జాతీయ గ్రామీణ తాగునీటి పథకం (ఎన్‌ఆర్‌డీడబ్ల్యూపీ) భారత ప్రభుత్వ ప్రాథమ్య పథకాల్లో ఒకటి. **1972-73** లో మొదట దీన్ని సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం (ఏఆర్‌డబ్ల్యూఎస్‌పీ)గా ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమానికి **1986**లో జాతీయ తాగునీటి పథకంగానూ, **1991**లో రాజీవ్‌గాంధీ జాతీయ తాగునీటి పథకంగానూ పేరు మార్చారు. దీన్ని **2009** ఏప్రిల్‌లో సవరించి, జాతీయ గ్రామీణ తాగునీటి పథకం (ఎన్‌ఆర్‌డీడబ్ల్యూపీ) గా అమలు చేస్తున్నారు.

**2002-07** మధ్య కాలంలో రాష్ట్రంలో అమలు చేసిన నీటి సరఫరా పథకాల అమలుకు సంబంధించి సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకంపై **2007** లో ఒక ఆడిట్ సమీక్షను నిర్వహించడమైంది. ఆ సమీక్షలో కనుగొన్న అంశాలను కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి **2008** మార్చి **31**తో ముగిసిన సంవత్సరానికి వెలువరించిన భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపర్చడమైంది. నీటి సరఫరా పథకాల అమలుకు సంబంధించిన ప్రణాళికా రచన, పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, నీటి వనరుల మనుగడ, నిర్వహణ, పర్యవేక్షణ వంటి అంశాల్లో పలు లోపాలను ఆ నివేదికలో వెల్లడిచేయడం జరిగింది. ప్రస్తుతం జాతీయ గ్రామీణ తాగునీటి పథకంగా వ్యవహరిస్తున్న ఈ పథకం అమలులో మెరుగుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం తగిన దిద్దుబాటు చర్యలను చేపట్టిందా లేదా అని పరిశీలించేందుకు ఐదేళ్ళ తర్వాత ఇప్పుడు మరో ఆడిట్ సమీక్షను నిర్వహించాలని నిర్ణయించడమైంది. ఈ అంశంపై గత ఆడిట్‌లో వెల్లడించిన లోపాలను పూర్తిగా సరిదిద్దలేదనీ, పలు లోపాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయనీ ప్రస్తుత ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. ఆడిట్‌లో కనుగొన్న ప్రధాన అంశాలను ఈ కింద పేర్కొనడమైంది:

- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న సమాచార వ్యవస్థ (ఎమ్ఐఎస్)లో ఉన్న ఆవాసాల కవరేజి వివరాల నిర్ధారణకు గత కొంత కాలంగా/ ఆడిట్ సమీక్షా కాలంలో ఎలాంటి సర్వేనూ చేపట్టలేదు. నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా నీటి వనరుల మనుగడపై రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపకపోవడం వల్ల పలు ఆవాసాలు 'పూర్తి స్థాయి నీటి వసతి ఉన్న ఆవాసాలు' స్థాయి నుండి 'పాక్షికంగా నీటి వసతి ఉన్న ఆవాసాలు' స్థాయికి దిగజారాయి. **2007-12** మధ్యకాలంలో **15,988 (49** శాతం**)** 'పూర్తి స్థాయి నీటి వసతి ఉన్న ఆవాసాలు', 'పాక్షికంగా నీటి వసతి ఉన్న ఆవాసాలు' స్థాయికి దిగజారాయి.

**(పేరా 5.4.1)**

- సత్వర గ్రామీణ నీటి సరఫరా పథకం/జాతీయ గ్రామీణ తాగునీటి పథకం మార్గదర్శకాల్లో నిర్దేశించిన ప్రకారం వార్షిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలి. పథకం అమలుకు నిర్దిష్ట మార్గదర్శనాన్ని చూపేలా, భౌతిక, ఆర్థిక పురోగతిని నిర్ణీత కాలవ్యవధుల్లో పర్యవేక్షించేలా ఈ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలి. ఐతే, ఆడిట్ సమీక్షా కాలంలోని **2007-11** మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం వార్షిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించలేదు.

**(పేరా 5.5.1)**

- మార్గదర్శకాల ప్రకారం, పూర్తికాని పథకాలకు, సమస్యాత్మక ఆవాసాలకు ప్రాధాన్యతనివ్వాలి. మచ్చుకు తనిఖీ చేసిన **66** ప్రాజెక్టుల్లో **27** ప్రాజెక్టులు ఇంకా అసంపూర్ణంగా ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడో **2002-10** మధ్యకాలంలో మంజూరైనవి. దీన్ని బట్టి పూర్తికాని పథకాలకు ప్రాధాన్యతనివ్వలేదని తెలుస్తోంది.

**(పేరా 5.5.1)**

- *2012 మార్చి నాటికి ప్రభుత్వం మంజూరీ నిచ్చిన 538 సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాల్లో 292 (54 శాతం) పథకాల పనులను మాత్రమే చేపట్టారు. వీటిలో 56 నీటి సరఫరా పథకాలు పూర్తయ్యాయి. మిగిలిన 236 నీటి సరఫరా పథకాల పనులు జరుగుతున్నాయి.*

**(పేరా 5.7)**

- *ఎంపిక చేసుకున్న నీటి సరఫరా పథకాల పనుల నిర్వహణలో పలు లోపాలు ఆడిట్ పరిశీలనలో వెల్లడయ్యాయి. ఆడిట్ గమనించిన వాటిలో పనులు పూర్తికాకపోవడం/పూర్తి చేయడంలో జాప్యం, నిర్మాణ వ్యయం పెరగటం, నిర్మాణ గడువుల పొడిగింపు, పనులను సరైనప్రాథమ్య క్రమంలో చేపట్టకపోవడం, నిష్ఫల వ్యయానికి దారితీసిన కేసులు ఉన్నాయి. పైపులైన్లు వేయడానికి అటవీ అనుమతులు రాకపోవడం, నీటిని తీసుకోడానికి నీటి పారుదల శాఖనుండి అనుమతి రాకపోవడం, భూసేకరణ జరగకపోవడం నీటి సరఫరా పథకాలు పూర్తికాకపోవడానికి ప్రధాన కారణాలు.*

**(పేరా 5.7)**

- *నిరంతరాయమైన నీటి సరఫరా కోసం నీటి వనరుల మనుగడ (సస్టైయినబిలిటీ) కొనసాగేలా చూసేందుకు 2006-11 మధ్యకాలంలో ₹162.56 కోట్ల అంచనా విలువతో ప్రభుత్వం మంజూరీనిచ్చిన 2,975 పనుల్లో ₹2.62 కోట్ల అంచనా విలువ గల 734 (2 శాతం) పనులను మాత్రమే చేపట్టడం జరిగింది.*

**(పేరా 5.8)**

- *జిల్లా స్థాయిలో నాణ్యత పరీక్షల కోసం కావలసిన మౌలిక వసతులు లేకపోవడం, నిర్ణీత వ్యవధుల్లో పరీక్షలు జరపక పోవడాన్ని బట్టి నీటి నాణ్యతకు తగిన ప్రాధాన్యతను ఇవ్వలేదని స్పష్టమౌతోంది. క్షేత్ర స్థాయిలో నీటి నాణ్యత పరీక్షల కోసం గ్రామ స్థాయిలో పంపిణీ చేసిన పరికరాలు (కిట్లు), వాటిలో వినియోగించాల్సిన రసాయనాలు/ వైయల్స్ లేని కారణంగా వృధాగా పడిఉన్నాయి.*

**(పేరా 5.9)**

## 1.7.5 నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనలు

### *1.7.5.1 సాంకేతిక కళాశాలల పని తీరు*

*మొత్తం 115 ప్రభుత్వ సాంకేతిక కళాశాలల నుంచి 21 కళాశాలలను ఆడిట్‌లో పరిశీలించినప్పుడు కొత్త కళాశాలల ఆవిర్భావానికి తగిన కార్యాచరణ ప్రణాళిక లేదనీ, వాటిలో ప్రవేశపెట్టిన కోర్సులకు వివిధ ఇంజినీరింగ్ కోర్సులలో అందుబాటులో ఉన్న సీట్లతో పొంతన లేదనీ వెల్లడైంది. హాస్టల్ సదుపాయం, సిబ్బంది, మౌలిక వసతులను సమకూర్చకుండానే కళాశాలలలో రెండవ షిఫ్టును ప్రవేశపెట్టారు. "ప్రావీణ్య వికాసానికి సమన్విత కార్యాచరణ కింద సాంకేతిక కళాశాలలపై ఉపసంఘం" అనే పథకానికి 2009-12లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ₹61.69 కోట్ల నిధులలో కేవలం ₹11.44 కోట్లు (18 శాతం) మాత్రమే ఆయా కళాశాలలు వినియోగించుకోగా, మిగతా మొత్తంలో ₹12.80 కోట్లు (21 శాతం) ప్రిన్సిపాళ్ళ దగ్గరా, ₹37.45 కోట్లు (61 శాతం) ప్రభుత్వం దగ్గరా నిరుపయోగంగా ఉండిపోయాయి. ప్రయోగశాలలు, వర్క్‌షాపుల కొరత, లోకల్‌ఏరియా నెట్‌వర్క్ వెసులుబాటు లేకపోవటం, పనిచేయని పరికరాలు, మరుగుదొడ్లు కూడా లేకపోవటం వంటి పలు మౌలిక లోపాలు నమూనా తనిఖీలో బయటపడ్డాయి. కళాశాలల నిర్వహణకు కీలకమైనవిగా భావించే పలు స్థాయిలలో సిబ్బందికొరత నెలకొంది. విద్యార్థులు 2008-09 నుంచి 2010-11 సంవత్సరాల మధ్య 24,769 మంది ఉత్తీర్ణత సాధించగా అందులో 4,672 మందికి (19 శాతం) శిక్షణ వేతనం లభించింది. కేవలం 3,770 మంది (15 శాతం) నియామకాలు పొందారు. ఈ విషయం మీద వీలైనంత వెంటనే దృష్టి సారించాలి.*

**(పేరా 6.1)**

### 1.7.5.2 బహుళ ప్రయోజనాల ఆడిటోరియం నిర్మాణంలో జాప్యం

*అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ ఇంజినీరింగ్ విశ్వవిద్యాలయ కళాశాల డ్రాయింగులు, డిజైన్లను రూపొందించటం లోని ఆలస్యం, డిజైన్లను మధ్యంతరంగా మార్చటం, మిగతా పనులు ఎవరికీ ఇవ్వకపోవటం వలన బహుళ ప్రయోజనాల ఆటిటోరియం నిర్మాణానికి వెచ్చించిన **₹1.87** కోట్లు ఫలితమివ్వకపోగా ఇది ఆరు సంవత్సరాల జాప్యంతోపాటు **2012** అక్టోబరు నాటికి **₹3.19** కోట్ల అదనపు ఆర్థిక భారానికి దారితీసింది.*

***(పేరా 6.2)***

### 1.7.5.3 శిల్పారామం వద్ద ఫైవ్ స్టార్ హోటల్ ప్రాజెక్టు

*పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో హైదరాబాద్‌లోని శిల్పారామం వద్ద పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో చేపట్టాలనుకున్న ఫైవ్ స్టార్ హోటల్ ప్రాజెక్టు కోసం కేటాయించిన స్థలానికి కౌలు మొత్తాన్ని లెక్కించేందుకు అప్పటి మార్కెట్ విలువను తీసుకొనకపోవటం వలన ప్రభుత్వం **33** సంవత్సరాల కౌలు కాలానికి అద్దె రూపేణా **₹29.36** కోట్లు నష్టపోయి, ఆమేరకు డెవలపర్‌కు అనుచిత లబ్ధిని చేకూర్చింది.*

***(పేరా 6.3)***

### 1.7.5.4 ఋషికొండలో బేపార్క్ రిసార్టులు

*ఒప్పుకున్న మేరకు మొత్తం భూమిని డెవలపర్‌కు స్వాధీనం చేయకపోవటం, అభివృద్ధి-నిర్వహణ ఒప్పందంమీద మళ్ళీ సంప్రదింపులు జరపటంలో ప్రభుత్వ శాఖ తొందర, చొరవ చూపకపోవటం (**13** ఎకరాల అటవీభూమి డీనోటిఫికేషన్‌కు **2009** ఫిబ్రవరిలో పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తిరస్కరించిన నేపథ్యంలో) ఫలితంగా విశాఖపట్నం-భీమిలి మార్గంలో నిర్మించతలపెట్టిన బేపార్క్ రిసార్ట్స్ ప్రాజెక్టు **11** సంవత్సరాలు గడచినా పూర్తికాక పోవటంతో సాగరతీరంలోని విశాఖపట్నాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యం నెరవేరలేదు.*

***(పేరా 6.4)***

### 1.7.5.5 దంత చికిత్సలకు అధిక చెల్లింపులు

*దంత చికిత్సలకు సంబంధించిన వైద్య ఖర్చుల చెల్లింపు విషయమై అనుసరించ వలసిన విధివిధానాలను ప్రభుత్వం **2007** ఏప్రిల్‌లో ప్రకటించగా వైద్య ఖర్చులు ఆమోదించే సమయంలో డ్రాయింగ్ అధికారులు ఈ ఆదేశాలను అనుసరించకపోవటం, బిల్లులు చెల్లించే తరుణంలో ఖజానా అధికారులు తగు జాగ్రత్త వహించకపోవటం **₹1.06** కోట్ల మేర అధిక చెల్లింపులకు దారితీశాయి.*

***(పేరా 6.5)***

### 1.7.5.6 ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పని తీరు

*నిర్మాణ కార్మికులందరినీ గుర్తించి, నమోదు చేసుకొనేందుకూ, కార్మిక యజమానులకు శిస్తు విధించి సక్రమంగా వసూలు చేసుకునేందుకూ అవసరమైన యంత్రాంగం లేకపోవటంతో ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును స్థాపించిన లక్ష్యం సరిగా నెరవేరలేదు.*

***(పేరా 6.6)***